చదువు

"ఎల్లలు దాటి వెళ్తే ఏంటి లాభం?

ఉన్నత విద్య కోసం ఇతర దేశాలకు వెళ్ళినపుడు అక్కడి సంస్కృతీ, జీవన శైలీ కొత్తగానూ, అబ్బురంగానూ అనిపిస్తాయి. దాన్ని జీర్ణించుకుని సర్దుబాటు చేసుకోవటానికి కొంత సమయం పడుతుంది. ఒంటరితనం, ఇంటిమీద బెంగ సహజం. కానీ ఈ తొలిదశ దాటాక స్వతంత్రంగానూ, బాధ్యతాయుతంగానూ విద్యార్థి వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. భిన్నదేశాల వారితో కలిసిమెలిసి చదువుకోవడం వల్ల విద్యాపరంగా శ్రేష్ఠతకూ, విశాల దృష్టికీ ఆస్కారం ఏర్పడుతుంది!

సీబీఐ అధికారి అవ్వాలంటే?

? డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. కొందరి స్ఫూర్తితో సీబీఐ ఆఫీసర్ కావాలనుకుంటున్నాను. అందుకు నేనేం చేయాల్సి ఉంటుంది? - కె.వినయ్

జ: సీబీఐ అధికారి కావాలనుకునేవారు నిశితంగా విషయాన్ని శోధించడం, విశ్లేషణ నైపుణ్యాలు, సమస్య పరిశోధన, పరిష్కారం, బృందంతో పనిచేయగల నైపుణ్యాలు, నిజాయతీ, సమయస్ఫూర్తి, దూరదృష్టి వంటి లక్షణాలను అలవరచుకోవాలి. డిగ్రీ చదివినవారు సీబీఐ ఉద్యోగాలకు అర్హులు. ఏటా కేంద్ర ప్రభుత్వం ఈ కొలువులకు నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగాన్ని కల్పిస్తారు. కాబట్టి ఇప్పటినుంచే అరిథ్‌మెటిక్, రీజనింగ్, ఇంగ్లిష్ సబ్జెక్టులపై దృష్టిసారించండి. వార్తాపత్రికలు, టీవీ వార్తలను ఎప్పటికప్పుడు అనుసరిస్తూ ఉండండి. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపైనా అవగాహనను పెంచుకోండి.

దూరవిద్యలో వ్యవసాయ కోర్సు?

? సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాను. నాకు వ్యవసాయ రంగంపై ఆసక్తి. దూరవిద్య ద్వారా కోర్సు అందించే సంస్థల వివరాలను తెలపండి. - నాగేశ్వరరావు

జ: వ్యవసాయంపై మీకున్న ఆసక్తికి అభినందనలు. మీరు గ్రాడ్యుయేషన్‌లో ఏం చదివారో తెలియజేయలేదు. మీరు మెకానికల్ ఇంజినీరింగ్ చదివుంటే ఎంటెక్‌లో అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ చదివి, వ్యవసాయంలో ఉపయోగపడే పరికరాల తయారీలో పాల్గొనవచ్చు. లేదా.. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు కాబట్టి ఏదైనా యాప్ లాంటి టూల్‌ను తయారుచేసి వ్యవసాయ రంగానికి తోడ్పడే ప్రయత్నం చేయండి. ప్రత్యక్షంగానే కాదు పరోక్షంగానూ చేయూతను ఇచ్చినవారవుతారు.

ఇక కోర్సుల విషయానికొస్తే.. వెల్లింగ్‌కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ దూరవిద్యలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ రూరల్ అండ్ అగ్రిబిజినెస్, ఇగ్నో పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ అగ్రికల్చర్ పాలసీ కోర్సులను అందిస్తున్నాయి. మీకు అర్హత ఉన్నదాన్ని బట్టి కోర్సును ఎంచుకోండి.

ఫోరెన్సిక్ లా చదవాలంటే?

? ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం చదువుతున్నాను. ఫోరెన్సిక్ లాపై ఆసక్తి ఉంది. అందించే కళాశాలలు, అర్హత వివరాలను తెలియజేయండి. - ఎస్. గురునాథ్

జ: ఫోరెన్సిక్ విజ్ఞానశాస్త్ర సాయంతో నేర ఘటనలపై దర్యాప్తు చేయడానికీ, న్యాయస్థానంలో నేరస్థుల ప్రాసిక్యూషన్‌లో సాక్ష్యాలను సేకరించడానికీ ఉపయోగపడే న్యాయశాస్త్ర అధ్యయనమిది. మనదేశంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ వారు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారికి ఎంఏ (క్రిమినాలజీ) కోర్సును అందిస్తున్నారు. ఐఎఫ్ఎస్ ఎడ్యుకేషన్ వారు ఫోరెన్సిక్ సైన్స్ అండ్ క్రిమినాలజీలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులనూ, పంజాబ్ యూనివర్సిటీ వారు డిప్లొమా ఇన్ ఫోరెన్సిక్ సైన్స్ అండ్ క్రిమినాలజీ కోర్సులనూ అందిస్తున్నారు.

ప్రస్తుతం మనదేశంలో కేవలం ఫోరెన్సిక్ లాపైనే కోర్సులు అందించే సంస్థలు తక్కువనే చెప్పాలి. విదేశాల్లో ఈ కోర్సుకు మంచి స్పందన ఉంది. మనదేశంలోని కొన్ని సంస్థలూ ఇప్పుడిప్పుడే ఈ కోర్సుపై దృష్టిపెడుతున్నాయి. త్వరలో అందుబాటులోకి రావొచ్చు.

● **ప్రొ.బి. రాజశేఖర్,** కెరియర్ కౌన్సెలర్

విదేశాల్లో చదువుకోవటం అంటే అమెరికా, యు.కె., కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియాల్లో మాత్రమేనా? ఇవి కాకుండా మరెన్నో గమ్యస్థానాలున్నాయి. ఆకర్షణీయమైన అవకాశాలతో అవి ఆహ్వానం పలుకుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో విలువనిచ్చే డిగ్రీ కోసం విద్యార్థులు కూడా కొత్త దేశాల వైపు చూస్తున్నారు. నాణ్యమైన విద్యను ఇవ్వటమే కాకుండా, ఖర్చుపరంగా అందుబాటులో ఉండటం ఈ దేశాల్లోని విశ్వవిద్యాలయాల ప్రత్యేకత!

స్వాగతిస్తున్నాయ్ సరికొత్త దేశాలు!

అమెరికాలాంటి దేశాల్లో వీసా నిబంధనలు కఠినమవటం మూలంగా విద్యార్థులు ప్రత్యామ్నాయాలను అన్వేషించాల్సివచ్చింది. అలా తెరమీదకు వచ్చినవే ఫ్రాన్స్, నెదర్లాండ్స్, ఇటలీ, జపాన్, వెస్ట్‌ఇండీస్‌లు. తక్కువ ఫీజుతో ప్రామాణిక విద్యను అందిస్తున్నాయీ దేశాలు. టెక్నాలజీ, ఐటీ, మెడిసిన్‌లలో స్పెషలైజేషన్‌ను బట్టి విభిన్న కోర్సులు ఇక్కడ లభ్యమవుతున్నాయి!

ఫ్రాన్స్

ఉన్నత విద్య, పరిశోధనల్లో శ్రేష్ఠతకు ఫ్రాన్స్ ప్రపంచవ్యాప్తంగా పేరుపొందింది. ఆర్కిటెక్చర్, పొలిటికల్ సైన్స్, లా, జర్నలిజం, డిజైన్, మేనేజ్‌మెంట్ స్టడీస్, టెక్నాలజీ, ఫ్యాషన్ మొదలైన విభిన్న సబ్జెక్టులను ఎంచుకోవచ్చు.

అండర్‌గ్రాడ్యుయేట్ విద్య: ఫ్రాన్స్ విశ్వవిద్యాలయాల్లో యూజీ డిగ్రీ వ్యవధి మూడేళ్ళు. విద్యాసంవత్సరం సాధారణంగా సెప్టెంబరు మధ్య నుంచి తర్వాతి ఏడాది జూన్ నెలాఖరు వరకూ కొనసాగుతుంది. కొన్ని విద్యాసంస్థలు ఏడాది పొడవునా ప్రవేశాలు కల్పిస్తాయి.

పోస్టుగ్రాడ్యుయేట్ విద్య: ఇక్కడ పీజీ ప్రోగ్రాములు మూడు రకాలుగా ఉంటాయి. మాస్టర్స్ డిగ్రీ వ్యవధి 2 నుంచి 3 సంవత్సరాలుంటుంది. 1) టాట్ మాస్టర్స్ (ఎంఏ, ఎమ్మెస్సీ) 2) రిసెర్చ్ మాస్టర్స్ (ఎంఏ బై రిసెర్చ్) 3) డాక్టరేట్స్ అండ్ పీహెచ్‌డీస్.

ప్రవేశాలకు సంబంధించి ఫాల్ ఇన్‌టేక్ సెప్టెంబరులోనూ, స్ప్రింగ్ ఇన్‌టేక్ జనవరిలోనూ ఉంటుంది.

ఖర్చు: ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖర్చు చాలా తక్కువ. ఇది కనిష్ఠంగా రూ. 14,030, గరిష్ఠంగా రూ. 46,500 వరకూ ఉంటుంది. ప్రైవేటు సంస్థల్లో ముఖ్యంగా బిజినెస్ స్కూళ్ళలో ఖర్చు అధికం. దీని ఖర్చు శ్రేణి ఏడాదికి రూ. 2,28,750 నుంచి రూ. 7.6 లక్షల వరకూ ఉంటుంది.

పనిచేసే అవకాశాలు: అంతర్జాతీయ విద్యార్థులు వారానికి 20 గంటల చొప్పున ఏడాదికి 964 గంటలు పనిచేయవచ్చు. గంటకు కనీసం 9.76 యూరోలను సంపాదించటానికి వీలుంటుంది. విద్యాభ్యాసం పూర్తయ్యాక విద్యార్థులు టెంపరరీ రెసిడెన్స్ పర్మిట్‌పై సంవత్సరం పాటు ఫ్రాన్స్‌లో నివసించవచ్చు. వారికి ఉద్యోగం లభిస్తే దాన్ని పొడిగించే అవకాశం ఉంది.

ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు

- ఈకోల్ పాలిటెక్నిక్
- పియరీ అండ్ మేరీ క్యూరీ వర్సిటీ
- పారిస్ సూడ్ యూనివర్సిటీ
- ఈకోల్ నార్మల్ సుపీరియర్ డీ లియాన్
- పారిస్ సైన్సెస్ ఎట్ లెటర్స్–పీఎస్ఎల్ రిసెర్చ్ వర్సిటీ

నెదర్లాండ్స్

పందొమ్మిదో శతాబ్దం మొదటి నుంచీ నెదర్లాండ్స్ విద్యాసంస్థలు ప్రాచుర్యం పొందుతూవచ్చాయి. ఈ దేశంలోని విద్యాసంస్థల్లో ఎకనామిక్స్ అండ్ బిజినెస్, హ్యూమన్ అండ్ సోషల్ సైన్సెస్, ఇంజినీరింగ్ సబ్జెక్టుల్లో విదేశీ విద్యార్థులు ఎక్కువగా చేరుతున్నారు.

అండర్ గ్రాడ్యుయేట్ విద్య: నెదర్లాండ్ విశ్వవిద్యాలయాల్లో అండర్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ కాలవ్యవధి 3 నుంచి 4 సంవత్సరాల వరకు ఉంటుంది. విద్యాసంవత్సరం సెప్టెంబర్ మధ్య నుంచి ప్రారంభమై మరుసటి ఏడాది జూన్‌తో ముగుస్తుంది. కొన్ని సంస్థలు ఏడాది పొడవునా ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నాయి.

పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్య: మాస్టర్ డిగ్రీ కాలవ్యవధి 1 నుంచి 4 సంవత్సరాల వరకూ ఉంటుంది. వీటిల్లో ప్రవేశాన్ని పొందాలంటే 6-8 నెలల ముందస్తు దరఖాస్తు తప్పనిసరి. సెప్టెంబర్‌లో మొదలయ్యే ఫాల్ ఇన్‌టేక్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు.

ఖర్చు: ట్యూషన్ ఫీజు తక్కువ, జీవనానికి అయ్యే ఖర్చు ఇంకా తక్కువ. బాచిలర్ ప్రోగ్రామ్‌కు అయ్యే ఖర్చు సరాసరి రూ. 4,57,560 - రూ. 11,43,750 మధ్య అవుతుంది. మాస్టర్ ప్రోగ్రామ్‌లకు అయితే రూ. 6,10,000 - రూ. 15,25,000 అవసరం. అంతర్జాతీయ విద్యార్థులకు ఇక్కడి విశ్వవిద్యాలయాలు చాలారకాల ఉపకార వేతనాలను అందిస్తున్నాయి.

ఉద్యోగావకాశాలు: ఏప్రిల్ 2017 నుంచి అందరు విద్యార్థులూ తమ చదువుతోపాటు పార్ట్‌టైం జాబ్‌ను వారానికి 10 గంటల చొప్పున పనిచేసే అవకాశముంది. స్వయం ఉపాధికి పనిగంటల నిబంధన వర్తించదు. ఓరియెంటేషన్ ఇయర్ పథకం ప్రకారం.. నెదర్లాండ్స్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ/ మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసుంటే పనిచేయడానికైనా, సొంత సంస్థను ఏర్పాటు చేసుకోవడానికైనా వర్క్ పర్మిట్ అవసరం లేదు.

ఆలోచించదగ్గ అయిదు

- యూనివర్సిటీ ఆఫ్ ఆమ్‌స్టర్‌డామ్
- డెల్ఫ్ట్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ
- వాగెనిన్‌జెన్ యూనివర్సిటీ అండ్ రిసెర్చ్
- లీడెన్ యూనివర్సిటీ
- యుట్రెచ్ట్ యూనివర్సిటీ

ఇటలీ

సాంకేతికతలో మౌలిక పరిశోధనలు ఇటలీ ప్రత్యేకత. ఉన్నతవిద్యలోని ప్రతి రంగంలో.. ముఖ్యంగా డిజైనింగ్, ఆర్కిటెక్చర్, అప్లయిడ్ సైన్సెస్, ఆర్ట్స్‌లో ఈ దేశం అగ్రగామిగా సాగుతోంది.

అండర్‌గ్రాడ్యుయేట్ విద్య: సాధారణంగా ఇక్కడ బాచిలర్ డిగ్రీని డిగ్రీ కోర్సుగా పిలుస్తారు. దీని కాలవ్యవధి 3 సంవత్సరాలు. ఇక్కడి విశ్వవిద్యాలయాల్లో విద్యాసంవత్సరం అక్టోబరులో ప్రారంభమవుతుంది.

పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్య: మాస్టర్స్‌కు రెండేళ్లు, పీహెచ్‌డీకి మూడేళ్లు. విద్యాసంవత్సరం ఆరంభం- అక్టోబరులో.

ఖర్చు: యూరప్‌లోని ఇతర దేశాలతో పోలిస్తే, ఇటలీలో ట్యూషన్ ఫీజు తక్కువ. బాచిలర్, మాస్టర్ ప్రోగ్రాములకు ఫీజు సరాసరిగా ఏడాదికి రూ. 61,000 నుంచి రూ. 1,14,000 వరకూ ఉంటుంది. ఇక్కడి ప్రైవేటు విశ్వవిద్యాలయాలు మాత్రం చాలా ఖరీదైనవి. అంతర్జాతీయ విద్యార్థులకు ఉపకార వేతనాల సౌకర్యం ఉంది.

ఉద్యోగావకాశాలు: అంతర్జాతీయ విద్యార్థులు ఒక వారానికి 20 గంటలపాటు పనిచేయవచ్చు. గ్రాడ్యుయేట్ విద్యార్థులు టెంపరరీ స్టే పర్మిట్ కింద ఆరు నెలల నుంచి ఏడాదిపాటు ఉండవచ్చు. ఫ్రాన్స్, జర్మనీ మొదలైన ఇతర యూరోపియన్ దేశాలతో పోలిస్తే ఇక్కడ అవకాశాలు మాత్రం చాలా తక్కువ.

ముఖ్యమైనవి ఇవీ..

- స్కువోలా నార్మల్ సుపీరియర్ డీ పీసా
- యూనివర్సిటీ ఆఫ్ బొలోగ్నా
- వీటా శాల్యూట్ శాన్ రాఫేల్ యూనివర్సిటీ
- యూనివర్సిటీ ఆఫ్ ట్రెంటో
- స్కువోలా సుపీరియర్ సాంటన్నా

జపాన్

ప్రపంచ ప్రసిద్ధి చెందిన పరిశోధన సౌకర్యాలు జపాన్ విశిష్టత. చాలా జపనీస్ విశ్వవిద్యాలయాలు కొన్ని నిర్ణీత అంశాల్లోని కోర్సులను ఆంగ్లంలోనే అందిస్తున్నాయి. ఇక్కడ ఒక్కో ప్రోగ్రామ్‌కు అయ్యే ఖర్చు యూకే/ యూఎస్ విశ్వవిద్యాలయాలతో పోలిస్తే ఎక్కువే.

అండర్‌గ్రాడ్యుయేట్ విద్య: ఇక్కడ జాతీయ, ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాలున్నాయి. అండర్‌గ్రాడ్యుయేషన్ కాలవ్యవధి 4 సంవత్సరాలు. కానీ మెడిసిన్, డెంటిస్ట్రీ, వెటర్నరీ సైన్స్ డిపార్ట్‌మెంట్ల విషయానికొచ్చేసరికి ఇది ఆరు సంవత్సరాలు.

పోస్టు గ్రాడ్యుయేట్ విద్య: గ్రాడ్యుయేట్ స్కూల్‌లో విద్యను పూర్తిచేయడానికి పట్టే సమయం విద్యార్థి ఎంచుకున్న (మాస్టర్స్ ప్రోగ్రామ్/ డాక్టర్స్ ప్రోగ్రామ్) ప్రోగ్రామ్‌ను బట్టి ఉంటుంది. మాస్టర్ ప్రోగ్రామ్‌కు అయితే రెండేళ్లు, డాక్టర్స్ ప్రోగ్రామ్స్‌కు అయితే అయిదేళ్ల సమయం పడుతుంది. జపనీస్ స్కూళ్ల విద్యాసంవత్సరం సాధారణంగా ఏప్రిల్‌తో మొదలై మరుసటి ఏడాది మార్చితో ముగుస్తుంది. కొన్ని తరగతులు సంవత్సరం పొడవునా నడుస్తాయి. మరొకొన్ని సెమిస్టర్లుగా విడిపోయి మొదటి సెమిస్టర్ ఏప్రిల్- సెప్టెంబరు వరకూ, రెండో సెమిస్టర్ అక్టోబరు నుంచి మార్చి వరకూ ఉంటాయి. సాధారణంగా విద్యార్థులు ఏప్రిల్‌లో తమ దరఖాస్తులు పంపి, పేర్లు నమోదు చేసుకుంటారు. కొన్ని సంస్థలు అక్టోబరు సమయంలోనూ ప్రవేశాలకు అనుమతిస్తాయి.

ఖర్చు: అండర్ గ్రాడ్యుయేట్స్‌కు ట్యూషన్ ఫీజు కనీసం రూ. 4,53,000 నుంచి రూ. 32 లక్షల వరకూ ఉంటుంది. గ్రాడ్యుయేట్లకు రూ. 4,62,000 నుంచి రూ. 10 లక్షల మధ్య ఉంటుంది.

ఉద్యోగావకాశాలు: కాలేజ్ స్టూడెంట్ వీసాతో పనిచేసే అర్హత విద్యార్థులకు ఉండదు. ఒకవేళ వారు ఎక్కడైనా పనిచేయాలనుకుంటే వర్క్ పర్మిట్ నిమిత్తం ఇమిగ్రేషన్ బ్యూరోకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకప్పుడు ఈ పర్మిట్‌ను రెసిడెన్స్ స్టేటస్‌గా ఇచ్చేవారు. ఇప్పుడు పని నిమిత్తం ఇస్తున్నారు. ఈ పర్మిట్ ఆమోదం పొందితే వారానికి 28 గంటలు పనిచేసుకునే వీలుంటుంది. ఒకసారి చదువు పూర్తయ్యాక విద్యార్థి టెంపరరీ రెసిడెన్స్ స్టేటస్‌పై ఆరు నెలల నుంచి సంవత్సరం వరకు ఉండవచ్చు. ఒకవేళ ఉద్యోగాన్ని పొందితే, వీసాను పొడిగించుకోవచ్చు.

ప్రధాన విద్యా సంస్థలు

- యూనివర్సిటీ ఆఫ్ టోక్యో
- తొహోకు యూనివర్సిటీ
- క్యోటో యూనివర్సిటీ
- నగోయా యూనివర్సిటీ
- టోక్యో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

వెస్ట్ ఇండీస్

ఇక్కడి విద్యావకాశాలు యూఎస్ మాదిరిగానే ఉంటాయి. మెడిసిన్ చదవడానికి ఉన్న మంచి అవకాశాల్లో కరేబియన్ ఒకటి. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరీ (ఐఎండీ)లో నమోదైన ఎన్నో మెడికల్ స్కూళ్లను కలిగి ఉండటంతో.. దేశీయ కళాశాలకు ప్రత్యామ్నాయాలను వెదుకుతున్నవారికి ఇదో ఎంచుకోదగ్గ గమ్యమైంది.

వైద్యవిద్య: ఇక్కడి వైద్య విద్యాసంస్థలు చాలావరకూ అమెరికా, కెనడా తరహా పాఠ్యాంశాల ఆధారంగానే బోధిస్తాయి. యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్స్ ఎగ్జామ్ (యూఎస్ఎంఎల్ఈ)లో అనేక విభాగాల్లో అర్హత సాధించేలా విద్యార్థిని తీర్చదిద్దడానికి అమెరికా వైద్య విద్యాసంస్థలు అనుసరించే విధానం, ఫిజీషియన్లుగా స్థిరపడటానికి ముందు అర్హత సాధించాల్సిన మెడికల్ కౌన్సిల్ ఆఫ్ కెనడా క్వాలిఫయింగ్ ఎగ్జామినేషన్ (ఎంసీక్యూఈ) విధానాలనే కరేబియన్ విద్యాసంస్థలూ అనుసరిస్తాయి. చాలామంది విద్యార్థులు కరేబియన్ మెడికల్ స్కూళ్లలో చదవడానికి మొగ్గు చూపడానికి కారణం- యూఎస్, కెనడియన్ మెడికల్ స్కూళ్లతో పోలిస్తే ఇక్కడ ఖర్చు, పోటీ తక్కువ. కొన్ని స్కూళ్లు కోర్సు వ్యవధిలోని మూడు, నాలుగు సంవత్సరాల్లో క్లినికల్ రొటేషన్ కింద యూఎస్ ఆస్పత్రుల్లో పనిచేసే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

ఖర్చు: ఇక్కడ ఫీజు అమెరికన్ మెడికల్ స్కూళ్ల ఫీజులో నాలుగో వంతు మాత్రమే. యూఎస్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా దీనికి విలువ ఉంది. మొత్తం వైద్యవిద్యా కోర్సుకు సగటున రూ. 68 లక్షల నుంచి రూ. 1.3 కోట్ల వరకూ ఉంటుంది.

ఉద్యోగావకాశాలు: కోర్సు పూర్తయ్యాక విద్యార్థులు అక్కడే ఉండి ఉద్యోగం చేసుకోవచ్చు. కానీ, చాలామంది విద్యార్థులు యూఎస్‌కు వెళ్లడానికి మొగ్గు చూపుతారు. యూఎస్, కెనడా, ఆస్ట్రేలియా, ఇతర దేశాలతో పోలిస్తే ఇక్కడ అవకాశాలు తక్కువ. అయినప్పటికీ ఇక్కడ చదవడానికి వెళ్లే విద్యార్థుల సంఖ్య తక్కువ కాబట్టి, సులువుగా సీటు దక్కించుకోవచ్చు.

ఇవి... పేరున్నవి

- రాస్ యూనివర్సిటీ
- సాబా యూనివర్సిటీ
- అమెరికన్ యూనివర్సిటీ ఆఫ్ ద కరేబియన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్
- అమెరికన్ యూనివర్సిటీ ఆఫ్ ఆంటిగ్వా
- సెయింట్ జార్జిస్ యూనివర్సిటీ, గ్రెనడా

శుభకర్ ఆలపాటి
డైరెక్టర్, గ్లోబల్ ట్రీ

మౌఖికంలో మెరిస్తే.. పోస్టు మీదే!

డిగ్రీ అధ్యాపకుల అభ్యర్థులకు ఏపీపీఎస్‌సీ మౌఖిక పరీక్షలు నిర్వహించబోతోంది. అవి ఏ తీరులో జరుగుతాయి? ఇంటర్వ్యూ బోర్డును మెప్పించగలిగేలా జవాబులు చెప్పాలంటే ఎలా సన్నద్ధం కావాలి?

కొడాలి భవానీ శంకర్

డిగ్రీ లెక్చరర్ల ఖాళీలు మొత్తం 504. ఏపీపీఎస్‌సీ 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఎంపిక చేసింది. రోజుకు 15 మంది చొప్పున 27.11.2017 నుంచి వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. సగటున గంటకు నలుగురిని ఇంటర్వ్యూ చేసే అవకాశం కనిపిస్తోంది. అంటే ఒక్కో అభ్యర్థికి 12-15 నిమిషాల సమయాన్ని కేటాయించే అవకాశముంది. ఈ కొద్ది సమయంలో అభ్యర్థి తాను డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి సరిపోతానని రుజువు చేసుకోవాల్సి రావడం కత్తిమీద సాము వంటిదే!

గ్రూప్-1, 2, సివిల్స్, బ్యాంకు ఉద్యోగాలు వంటి వాటితో పోలిస్తే అధ్యాపకుల ఇంటర్వ్యూ భిన్నంగా ఉంటుంది. లెక్చరర్‌కు ఉండాల్సిన ప్రత్యేక లక్షణాలేంటని ఆలోచిస్తే ఎలా తయారవ్వాలో అర్థమవుతుంది. ఇక్కడ ప్రధానంగా మూడు అంశాలను దృష్టిలో ఉంచుకునే అవకాశముంది.

బోధనా నైపుణ్యం

ఇంటర్వ్యూలో సబ్జెక్టు సంబంధిత అంశాలకు 60%



వెయిటేజీ ఇస్తారని భావించినా బోధనా నైపుణ్యం ఆధారంగా మిగతా 40% మార్కులను నిర్ణయించవచ్చు. సబ్జెక్టుపై ఎంత పట్టున్నా, దాన్ని సరిగా విద్యార్థులకు చేర్చలేనపుడు ప్రయోజనం ఉండదు. కాబట్టి అభ్యర్థి బోధనా నిపుణతను అంచనా వేయడానికి బోర్డు వివిధ ప్రమాణాలను వినియోగించే/ పరిశీలించే అవకాశం ఉంటుంది. బోర్డు మీద పాఠం చెప్పమని అభ్యర్థిని కోరవచ్చు. అలాంటి పరిస్థితిని ఎదుర్కోవడానికి 4, 5 పాఠాలను ప్రణాళికాయుతంగా సిద్ధంగా ఉంచుకోవాలి. అనుభవజ్ఞులైనవారి ముందు బోధించి తప్పు, ఒప్పులను సమీక్షించుకోవచ్చు. పాఠం చెప్పాల్సివస్తే కనీసం 7-10 నిమిషాల బోధనకు సిద్ధపడాలి. బ్లాక్‌బోర్డును తన గదిలో ఏర్పరిచే అవకాశం ఉంది. ఒకవిధంగా అభ్యర్థి అంతిమ విజయం ఈ దశలో చేసే ప్రదర్శనపైనే ఆధారపడి ఉంటుంది.

◆ డిగ్రీ లెక్చరర్ల ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్లేవారు ఎంపిక చేసుకునే పాఠాల్లో అవగాహన, నైపుణ్యం, అన్వయాలకు ఎక్కువ వకాశం ఉండేలా బోధన పథకాన్ని సిద్ధం చేసుకోవాలి. ఆబ్జెక్టివ్ తరహా బోధన కంటే సబ్జెక్టివ్ తరహా బోధనకు అవకాశం ఉండేలా పాఠాలను ఎంచుకుంటే బోర్డును మెప్పించడం సులువు.

◆ బోధన ఎక్కువ ఇంటరాక్టివ్‌గా ఉండేలా చూసుకోవాలి. యాంత్రికంగా బోధించే కంటే విద్యార్థులను భాగస్వాములను చేసే మెలకువలను ఉపయోగిస్తే మంచి ఫలితాలు రాబట్టవచ్చు.

విద్యా దృక్పథాలు- విధానాలు

అభ్యర్థులు అధ్యయనం చేయాల్సిన మరో కీలకాంశం- భారతీయ విద్యా తాత్వికత. అదేవిధంగా ఆధునిక భారతదేశంలో విద్యా ధోరణులను కూడా ప్రశ్నల రూపంలో ఎదుర్కోవాల్సి రావచ్చు. జాతీయ విద్యా విధానం, ప్రస్తుత విశ్వవిద్యాలయాల స్థితిగతులు, ఉన్నత విద్య రుగ్మతలు- పరిష్కార మార్గాలు మొదలైన అంశాలపై కూడా పట్టు ఉంటే మంచిది. కేంద్రప్రభుత్వం ప్రారంభించిన ఇంక్యుబేషన్ సెంటర్లు, స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా మొదలైనవాటి నేపథ్యాన్నీ, విద్యా వ్యవస్థ రుగ్మతలనూ అనుసంధానం చేసి, సమాధానాలను ఇవ్వగలిగితే అభ్యర్థి చింతనపై బోర్డుకు గురి ఏర్పడుతుంది.

మహిళా విద్య- సమస్యలు, ఉపాధి కల్పించలేని విద్యావ్యవస్థ, ర్యాగింగ్, రిజర్వేషన్లు, ప్రైవేటు, విదేశీ విశ్వవిద్యాలయాలు, కార్పొరేట్ విద్య మొదలైన అంశాలపైనా పటిష్ఠమైన అవగాహన అవసరం. బయోడేటా ఆధారిత ప్రశ్నలతోపాటు ఈ తరహా అంశాలకూ సిద్ధమైతే విజయం సాధించడం సులువవుతుంది.